కోడిగుడ్లను చూపుతున్న కళాశాల వైద్య విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవం

కోరుట్ల, అక్టోబర్ 13: పట్టణంలోని పీవీ నర్సింహారావు పశు వైద్య కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ కోడి గుడ్డు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిగుడ్డును పెద్దల నుంచి చిన్నారుల వరకు ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ మాధవరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ దైదా కృష్ణ ప్రసాద్, వెటర్నరీ వైద్యులు రాజు, అరుణకుమారి, సురేశ్, పరశురాములు, నాగరాజ్, రమ్య, రవికాంత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు

కోరుట్ల, అక్టోబర్ 13: పట్టణంలోని అతి పురాతనమైన మహాదేవ స్వామి దేవాలయంలో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పంచామృతాలతో అభిషేకం జరిపించారు. హాజరైన భక్తులను తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కథలాపూర్ ఎంపీవో గంగాధర్ బదిలీ

కథలాపూర్, అక్టోబర్ 13: కథలాపూర్ మండల పంచాయతీ అధికారిగా గంగాధర్ బదిలీ అయ్యారు. గంగాధర్ ఆదిలాబాద్ జిల్లా డీఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీపై వెళ్లారు. కథలాపూర్ ఇన్‌చార్జి ఎంపీవోగా మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ తౌఖీర్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ సభ్యులు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13: మహబూబ్‌నగర్ పట్టణంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నం రాంరెడ్డి, ఏ నరేందర్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థులు రాష్ట్ర విద్యా మహాసభలకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డంప్ యార్డు తొలగించాలని వినతి

జగిత్యాల రూరల్, అక్టోబర్ 13: జగిత్యాల మున్సిపాలిటీకి సంబంధించి జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగపూర్ గ్రామ శివారులో గల డంప్ యార్డును వెంటనే తొలగించాలని కోరుతూ శుక్రవారం గ్రామ సర్పంచ్ సరోజన-మల్లారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపాల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. గురువారం గ్రామంలో గ్రామసభను నిర్వహించగా పది రోజులుగా తమ శివారులో డంప్ యార్డులో చెత్తను కాల్చడం ద్వారా దట్టమైన పొగవస్తుందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సభలో తీర్మానం చేశారు. శుక్రవారం జగిత్యాలలో వినతి పత్రాలు అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, గంట వేణు రావు, మంగళారపు మైపాల్, గడ్డం గంగారెడ్డి, సిరికొండ మహేశ్, నేరెళ్ల గంగరాజు, నేరెళ్ల అజయ జాన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట వినతి పత్రాలు చూపిస్తున్న నాయకులు

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

జగిత్యాల : బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మల్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకురాళ్లు, విద్యార్థులు

జగిత్యాల, అక్టోబర్ 13: జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర ప్లే స్కూల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి విద్యార్థులు బతుకమ్మలతో ర్యాలీగా స్థానిక చింతకుంట తటాకం వరకు వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు సుమన్ రావు, సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్లు బీ శ్రీధర్‌రావు, బీ హరిచరణ్ రావు, బీ రజిత, బీ అజిత, జే మౌనిక, కే కిషన్, జే రాజు, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్, అక్టోబర్ 13: రేచపల్లి గ్రామంలోని బెన్ హిన్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. శనివారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు కావడంతో ఆయా పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థినిలు బతుకమ్మలను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి ఆడిపాడారు. అనంతరం బతకమ్మలను గ్రామ శివారులోని ఊర చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమోల్, కరస్పాండెంట్ కుంబాల అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, అక్టోబర్ 13: రాయికల్ పట్టణంలోని ప్రగతి హైస్కూల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి పాఠశాలలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ బాలె జయశ్రీ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, అక్టోబర్ 13: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తుగా బతుకమ్మ, దసరా పండుగలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాశాలలోని మహిళా అధ్యాపకురాళ్లు బతుకమ్మలను పేర్చి డీజే సౌండ్‌ల మధ్య నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటెయ్యండి..
చల్మెడను గెలిపించండి

■ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ■ పోతారంలో ఇంటింటా ప్రచారం ప్రారంభం

కథలాపూర్, అక్టోబర్ 13: కారు గుర్తుకు ఓటు వేసి చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోతారం గుట్టల్లో ఉన్న లొంక రామేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా ప్రచారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటా తిరుగుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగాప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, సర్పంచ్ ధర్మపురి జలేంధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రకం పురుగులపై పరిశీలన

మామిడి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13: కర్ణాటక రాష్ట్రంలోని మామిడి తోటల్లో సాఫ్ట్ స్కేల్స్ అనే కొత్త రకం పురుగులపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, సమగ్ర సస్య రక్షణ కేంద్ర శాస్త్రవేత్తలతో పరిశీలన జరిపించారు. అనంతరం మాట్లాడుతూ, కొడిమ్యాల, మల్యాల, జగిత్యాల రూరల్, గొల్లపల్లి మండలాల్లో మామిడి తోటల్లో సాఫ్ట్ స్కేల్స్ అనే పొలుసు పురుగు ఆనవాళ్లు లేవని తేల్చి చెప్పారు. ఆ పురుగుపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. సాఫ్ట్ స్కేల్స్ అనే పురుగు కనిపిస్తే సంబంధిత ఉద్యాన అధికారికి సమాచారం అందించాలని రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో హైదరాబాద్ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు ఏ కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్వేత, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఉద్యాన అధికారిని ఎం స్పందన పాల్గొన్నారు.

కూర్చొని.. కుప్పకూలాడు..

ధర్మపురి, అక్టోబర్ 13: ధర్మపురి పట్టణంలో కుర్ర సమ్మయ్య(55)అనే వ్యక్తి ఓ హోటల్ ఎదుట కూర్చుని అలాగే కుప్పకూలాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన సమ్మయ్య ధర్మపురిలో ఏడాదిగా పాత ఇనుప సామగ్రి సేకరిస్తూ జీవిస్తున్నాడు. అంతకు ముందు ధర్మపురిలో హోటళ్లల్లో పని చేస్తూ జీవించాడు. అయితే శుక్రవారం ఉదయం అంబేద్కర్ చౌక్ వద్ద ఓ హోటల్ ఎదుట కూర్చొని కూర్చున్నవాడు కూర్చున్నట్లే కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బంధువులకు సమాచారం అందించి మృత దేహాన్ని మార్చురీకి తరలించారు.

పొలాసలో అమృత కలశ యాత్ర

నివాళులర్పిస్తున్న పొలాస కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

జగిత్యాల టౌన్, అక్టోబరు 13: పొలాస వ్యవసాయ కళాశాలలో మేరి మాటి మేర దేశ్ (ఎంఎంఎండీ) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 100 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో అమృత కలశ యాత్రను పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులు, వీరనారులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టీ ఎల్లా గౌడ్, డాక్టర్ వీ రత్నాకర్, జీ ప్రజ్ఞ, బోధన, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామమైన రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికలో మామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే స్వాతి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తేనెమంచు తెగులు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి, మచ్చ తెగులు, పక్షికన్ను తెగులు నివారణకు కార్బెండిజిమ్, మాంకొజెబ్ ద్రావణం 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఆమె సూచించారు. డాక్టర్ రజినీదేవి దత్తత గ్రామంలో నూతనంగా ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంఘంలోకి రైతులందరూ సభ్యత్వం తీసుకోవాల్సిందిగా సూచించారు. అదేవిధంగా ఈక్విటీ మంజూరు కోసం 300 మంది రైతులు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సుమలత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు